TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9000281049

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 240 | ఆదివారం 23-08-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-

## దౌత్యనీతి అంటే టీ20లే కాదు..

### టెస్టులూ ఉంటాయి: జైశంకర్



దౌత్యం, భౌగోళిక రాజకీయాలను ఎల్లప్పుడూ త్వరిత ఫలితాల దృష్టితో అంచనా వేయలేమని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. కొన్ని అంతర్జాతీయ సవాళ్లకు సహనం, దీర్ఘకాలిక నిబద్ధత అవసరమని చెప్పారు. 'ఎకనామిక్ టైమ్స్ వరల్డ్ లీడర్స్ ఫోరమ్'ను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రస్తుత దౌత్యనీతి 'టీ20 క్రికెట్'ను పోలి ఉందా? అనే ప్రశ్నకు ఆయన ఈమేరకు స్పందించారు. "అంతర్జాతీయ సంబంధాలు సుదీర్ఘమైన, అనిశ్చిత ప్రక్రియలతో కూడుకున్నవి. భౌగోళిక రాజకీయ సమస్యలకు ప్రభుత్వాలు, మీడియా త్వరితగతిన పరిష్కారాలు కోరుకుంటాయి. కానీ వీటి పరిష్కారం సుదీర్ఘకాలంలో రూపుదిద్దుకుంటుంది. పేజి 2లో ▶

## సీఎం యోగి సహా 52మంది నేతలకు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు..!

### వచ్చే ఏడాది యూపీలో అసెంబ్లీ ఎన్నికలు

- సీఎం యోగి సహా 52 మంది నేతలకు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు
- జాబితాలో అఖిలేశ్ యాదవ్, మాయావతి కూడా
- ఒక్కో జాకెట్ ధర రూ.10 లక్షలు
- జాకెట్లు పొందిన వారిలో 11 మంది రాష్ట్ర మంత్రులు
- మరో 98 మంది నేతలు, ప్రముఖులకు భద్రత
- ఎన్నికల సన్నాహాల్లో బీజేపీ సర్వేలు
- నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, అభ్యర్థుల





2లో

## ఏపీలో 10,060 ఉద్యోగాలు..

### జాబ్ క్యాలెండర్ వచ్చేసింది..

- ఏపీలో 10,060 ఉద్యోగాలు.. జాబ్ క్యాలెండర్ 2026 విడుదల
- నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీ
- సెప్టెంబరు, అక్టోబరులో నోటిఫికేషన్లు
- గ్రూప్-1లో 149 పోస్టులు
- గ్రూప్-2లో 673 ఉద్యోగాలు
- విద్యాశాఖలో 2,995 పోస్టులు

2లో





## లండన్ యూనివర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

### తెలంగాణకు ప్రపంచస్థాయి విద్యాసంస్థలే లక్ష్యం

- లండన్ యూనివర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్ బృందం
- హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటుపై లండన్ వర్సిటీ ఆసక్తి
- విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యాలపై చర్చ
- కేంబ్రిడ్జ్ వర్సిటీ ప్రతినిధులతో సీఎం సమావేశం
- హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటుకు ఆహ్వానం
- ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లపై చర్చ
- హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యం
- తెలంగాణతో కలిసి పనిచేసేందుకు కేంబ్రిడ్జ్ ప్రొఫెసర్ల ఆసక్తి

తెలంగాణకు ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు బృందం లండన్ యూనివర్సిటీని సందర్శించింది. తెలంగాణలో ఉన్న అవకాశాలపై ఆ వర్సిటీ ప్రతినిధులతో సీఎం బృందం చర్చించింది. హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటుకు ఆలోచిస్తున్నట్లుగా లండన్ వర్సిటీ ప్రతినిధులు ఈ సందర్భంగా తెలిపారు.

అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి తన బృందంతో కలిసి కేంబ్రిడ్జ్ వర్సిటీకి వెళ్లారు. ఆ వర్సిటీ ప్రతినిధులతో సమావేశమై విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చించారు. హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసి ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను వివరించారు. రాజధాని నగరాన్ని ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే తమ ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెటింగ్‌కు చెందిన ప్రొఫెసర్లు జయదీప్ ప్రభ్, వెంకట శిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఓట్లడిగే ప్రసక్తే లేదు:

### మంత్రి పొంగులేటి



- నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు.. ఓట్ల కోసం కాదు
- ఇళ్లిచ్చి ఓట్లు అడిగే ప్రసక్తే లేదు:
- అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు
- కొత్త టెక్నాలజీతో ఇందిరమ్మ మోడల్ టవర్స్
- నిజామాబాద్‌లో హౌసింగ్ టవర్ నిర్మాణ పనుల పరిశీలన
- పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన
- నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు

2లో

## చంద్రంపాలెం పాఠశాల పేరు చెబితే.. వర్షం గుర్తొస్తుంది:

### మంత్రి లోకేశ్



2లో

- చంద్రంపాలెం పాఠశాలకు మంత్రి లోకేశ్ సందర్శన
- రూ.6.48 కోట్లతో పాఠశాల పునర్నిర్మాణ పనులు
- ఆర్వో ప్లాంట్, క్రీడా ప్రాంగణాల ప్రారంభం
- క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులు అందుబాటులోకి
- వాకింగ్ ట్రాక్ ప్రారంభం

## గచ్చిబౌలి ఘటన..

### అలాంటి భవనాలన్నీ కూల్చేస్తాం: రంగనాథ్



2లో

- గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో అక్రమ భవనాలపై హైడ్రా కొరడా
- 50 గజాల్లో ఏడంతస్తుల భవనం.. పైగా పెంట్‌హౌస్
- నిబంధనలకు విరుద్ధమైన భవనాలు కూల్చివేస్తాం:

## డీఎస్సీలో అవకతవకలు జరగలేదు..

### జరగనివ్వను: సీఎం చంద్రబాబు



- మెగా డీఎస్సీలో ఎలాంటి అవకతవకలు జరగలేదు
- అవకతవకలు జరగనివ్వను: సీఎం చంద్రబాబు
- మెరిట్ ఆధారంగానే పోస్టుల భర్తీ
- కేంద్ర నిబంధనల ప్రకారమే క్రీడా కోటా
- డీఎస్సీపై 350 పిటిషన్లు వేశారు
- ఉపాధ్యాయులను అగౌరవపరిచే కుట్రకు వైకాపా తెరలేపింది
- వైకాపా హయాంలో గ్రూప్-1 నియామకాల్లో అవకతవకలు
- ఎన్నికల్లో డబ్బు ప్రభావం తగ్గించాలి
- రాజకీయాల్లోనూ ప్రక్షాళన అవసరం
- నకిలీ మద్యంతో వేలాది మంది మృతి చెందారని చంద్రబాబు ఆరోపణ

అనకాపల్లి: మెగా డీఎస్సీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని సీఎం చంద్రబాబు మరోసారి తేల్చి చెప్పారు. అన్ని ఉద్యోగాల్లో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే క్రీడా కోటా అమలు చేశామన్నారు. ఉపాధ్యాయులను అగౌరవపరిచే కుట్రకు వైకాపా తెరలేపిందని మండిపడ్డారు. వైకాపా హయాంలో గ్రూప్ 1 నియామకాల్లో అవకతవకలకు పాల్పడి.. ఏపీపీఎస్సీని అస్తవ్యస్తం చేశారన్నారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. పేజి 2లో ▶

## నేను కూడా ఒక పాలిటెక్నిక్ విద్యార్థినే..

పాలిటెక్నిక్ కళాశాలలను ఐటీఐలతో విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సిద్దిపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రాజ్ గోపాల్ పేట్ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విద్యార్థులను చూసి ఆగి వారికి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. నేను కూడా ఒక పాలిటెక్నిక్ విద్యార్థినే.

2లో

### మీ కష్టాలు నాకు బాగా తెలుసు : హరీశ్ రావు



## కనకదుర్గమ్మను దర్శించుకున్న గోవా సీఎం



2లో

## భూభారతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: కిషన్ రెడ్డి



2లో

TGTEL/25/A0827
ప్రజా దివాన్
తెలుగు దినపత్రిక
23-08-2026

# సంపాదకీయం

## ఆధునిక భారతానికి అతనే సర్కార్ !!

'భారతీయ చరిత్రకారులమైన మేము, ఏ ఇతర అజెండాను అనుసరించకుండా సొంత అజెండా ప్రకారమే రాయాలనుకున్న చరిత్రలనే రాశాము. అయితే ఇది గతించిన విషయం. ఆ మేధా స్వేచ్ఛ ఇప్పుడు లభించడం లేదు. అది వేగంగా కనుమరుగవుతున్నట్లు కనిపిస్తోంది'-- దశాబ్దాల తన మేధా కృషిని సింహావలోకనం చేసుకుంటూ ఆధునిక భారతదేశ చరిత్రకారుడు సుమిత్ సర్కార్ విచారగ్రస్తంగా చేసిన వ్యాఖ్యలవి.

ప్రతిభావంతమైన, సూత్రబద్ధమైన భారతీయ మార్క్సిస్ట్ చరిత్రకారులలో అగ్రగణ్యుడిగా సుదీర్ఘమైన, మేధో సంపద్వంతమైన జీవితాన్ని గడిపిన సుమిత్ సర్కార్ ఇతరులు రుద్దిన మూడు చారిత్రక అజెండాలను ఎదుర్కోవలసివచ్చింది. మొదటిది-- గతాన్ని ఆర్థిక నియతి దృక్కోణంలో అధ్యయనం చేసే పిడివాద మార్క్సిజం; రెండోది-- పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజంల అంతస్సంబంధ ధోరణి. మానవ సామాజిక ప్రవర్తన అధ్యయనంలో అత్యంత ప్రభావశీలమైన ఈ మేధో ధోరణి అమెరికాలో స్థిరపడిన లేదా ఆ దేశంలో ఉన్నత విద్యాభ్యాసం చేసిన భారతీయులను మరీ ముఖ్యంగా బెంగాలీ విద్యాధికులను విశేషంగా ఆకర్షించింది. మూడోది-- సంఘ్ పరివార్ మతపరమైన మెజారిటేరియనిజం.

పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజం ఆలోచనా స్రవంతుల ప్రభావ పరిధిలోనే ఉండిపోయేందుకు సుమిత్ సర్కార్ నిరాకరించారు. ఈ రెండు అత్యాధునిక చింతనాధోరణులను తిరస్కరించడంలో సబాల్టర్న్ స్టడీస్ స్కూల్ లోని తన సహచరుల కంటే చాలా కచ్చితమైన, స్పష్టమైన వైఖరిని ఆయన తీసుకున్నారు. వ్యక్తి జీవితంలోను, సమాజ గమనంలోను ఆర్థిక శక్తులు నిర్వహించే పాత్రకు పోస్ట్ మోడర్నిజం, పోస్ట్ కలోనియలిజం తక్కువ ప్రాధాన్యమివ్వడాన్ని సుమిత్ సర్కార్ ఆమోదించలేకపోయారు. సంఘ్ పరివార్ హిందుత్వ భావజాలాన్ని ఆయన నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. గతించిన యుగాల చరిత్రపై సంఘ్ తప్పుడు అవగాహనలు, వర్తమానంలో ప్రజాస్వామ్యానికి, బహుళత్వవాదానికి వాటి వల్ల ఎదురవుతున్న విషమ పర్యవసానాల కారణంగానే సంఘ్ పరివార్ ఔదలదాల్చిన మతపరమైన మెజారిటేరియనిజంను సుమిత్ సర్కార్ అమితంగా గర్హించారు.మార్క్సిజంతో సుమిత్ సర్కార్ సంబంధం మరింత సంక్లిష్టమైనది. మార్క్సిస్టు చింతనలోని ఆర్థిక నిర్ణయవాదంతో ఆయన పూర్తిగా ఏకీభవించలేదు. భారతదేశంలో సామాజిక అసమానతలకు కులం, జెండర్ మూల స్తంభాలని, వర్గానికి ఉన్న ప్రాధాన్యమే ఆ రెండిటికీ ఉన్నదని ఆయన గుర్తించారు. సుమిత్ సర్కార్ తన సహచర చరిత్రకారులను దృష్టిలో ఉంచుకుని రాసిన పరిశోధనా పత్రాలలో గానీ, సామాన్య పాఠకులను దృష్టిలో ఉంచుకుని రాసిన వ్యాసాలలో గానీ మార్క్సిస్టు సిద్ధాంత పరిభాష ఉండదు. నాకు తెలిసినంతవరకు ఆయన ఏ కమ్యూనిస్టు పార్టీలోనూ ఎప్పుడూ సభ్యుడిగా లేరు.సుమిత్ సర్కార్ మొదటి పుస్తకం 'ది స్వదేశీ మూవ్‌మెంట్ ఇన్ బెంగాల్ (1903--1908) 1973లో ప్రచురితమయింది. బెంగాల్ విభజనకు ప్రతిస్పందనగా ప్రజ్వరిల్లిన ఈ స్వదేశీ ఉద్యమం యావద్భారతావనిలో రగిల్చిన అపూర్వ సామాజిక, రాజకీయ చైతన్యాన్ని ప్రతిభావంతంగా వివరించడంతో పాటు ఆ ఉద్యమ వైఫల్యాలను కూడా ఆయన నిశితంగా విశ్లేషించారు.1997లో ప్రచురితమైన సుమిత్ సర్కార్ మరో పుస్తకం 'రైటింగ్ సోషల్ హిస్టరీ'లో బెంగాలీలకు ఆరాధ్యులు అయిన రామకృష్ణ పరమహంస, ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌పై వ్యాసాలతో పాటు రాజకీయ భావజాలాల్లో కులం నిర్వహిస్తున్న పాత్ర, తాను అభిమానించే, లేదంటే ఆమోదించలేని చరిత్ర రచనా సంప్రదాయాలపై నిశిత విమర్శలతో కూడిన వ్యాసాలున్నాయి. ప్రస్తావిత రెండు పుస్తకాలూ మళ్లీ మళ్లీ చదవవలసిన పుస్తకాలే, సందేహం లేదు. అయితే సుమిత్ సర్కార్ రచనలలో అత్యంత ప్రసిద్ధమైనది 'మోడరన్ ఇండియా: 1885--1947.' మన స్వాతంత్ర్యోద్యమంపై సమగ్రమైన, ప్రామాణికమైన రచన అది. వలసపాలన చివరి దశాబ్దాల్లో ఘటనలు, పరిణామాలు, సామూహిక జాతీయవాదం ఆవిర్భావాన్ని సుమిత్ సర్కార్ అనితరసాధ్యంగా వివరించారు. 'మోడరన్ ఇండియా' రాయడంలో తన రెండు ఉద్దేశ్యాలను ఆ పుస్తకం ముందుమాటలో ఆయన ఇలా పేర్కొన్నారు: 'మొదటిది-- రాజకీయ, సామాజిక, ఆర్థిక చరిత్రలోని ప్రత్యేక సమస్యలపై ఇటీవలి కాలంలో వెలువడిన అనేక పరిశోధనా గ్రంథాలను, ఇంకా వెలికితీసిన అపార సమాచారాన్ని ఒక చోట చేర్చడం; రెండవది-- నాయకుల కార్యకలాపాలు, ఆదర్శాలు లేదా వర్గ పోరాట వ్యూహాలకే జాతీయవాద చరిత్ర రచన ఇస్తున్న ప్రాధాన్యానికి ప్రత్యామ్నాయంగా.. కింది స్థాయి నుంచి (అంటే సామాన్య ప్రజల కోణం నుంచి) చరిత్రను రచించే అవకాశాలను పరిశీలించడం'. ఈ రెండు ఉద్దేశ్యాలు సంపూర్ణంగా నెరవేరాయి. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఉపఖండంలోని అన్ని ప్రాంతాలకు ఆయన సమప్రాధాన్యమిచ్చారు. మరీ ముఖ్యమైన విషయమేమిటంటే భారత జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన పోరాటాలు ఉద్యమాలకే కాకుండా, పరాయి పాలకులపై ఆదివాసీల, రైతుల తిరుగుబాట్లకు కూడా సమంజసమైన ప్రాధాన్యాన్ని సుమిత్ సర్కార్ ఇచ్చారు. హిందూ--ముస్లింల మధ్య విభేదాలు ఊపిరిపోసుకున్న తీరుతెన్నులు, దేశ విభజన విషాద ఘటనలను ఆయన గొప్ప నైపుణ్యంతో, కచ్చితత్వంతో వివరించారు. ఈ విశిష్టతల కారణంగానే, ప్రచురితమైన 43 సంవత్సరాల అనంతరం కూడా సుమిత్ సర్కార్ విరచితమైన 'మోడరన్ ఇండియా' భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రపై అత్యుత్తమ ఏక సంపుటి పుస్తకంగా వెలుగొందుతోంది.'మోడరన్ ఇండియా'లో కులంపై సుమిత్ సర్కార్ చూపిన శ్రద్ధ మార్క్సిజంపై ఆయన సంప్రదాయ విరుద్ధ వైఖరులను స్పష్టం చేస్తోంది. అంతకంటే ముఖ్యంగా మహాత్మాగాంధీ చారిత్రక ప్రాధాన్యంపై ఆయన భావాలు, అభిప్రాయాలు వారసత్వంగా సంక్రమించిన మనో వైఖరులను ఆయన ఎంతగా విడనాడారో కూడా స్పష్టం చేస్తాయి. మహాత్మాగాంధీ అహింసాత్మక పోరాటం విప్లవ కార్యాచరణ నుంచి ప్రజలను దూరం చేసే కపట వ్యూహమని మార్క్సిస్టు సిద్ధాంతకర్తలు రజనీ పామీదత్, మానవేంద్రనాథ్ రాయ్ అభిప్రాయపడ్డారు. అలాగే మత సామరస్యానికి మహాత్ముడు ఇచ్చిన ప్రాధాన్యం వర్గ పోరాటాల నుంచి జన బాహుళ్యాన్ని వేరు చేసే యుక్తి మాత్రమేనని కూడా ఆ ఇరువురు తీవ్రంగా విమర్శించారు. అయితే సుమిత్ సర్కార్ ఆ ఇరువురితో విభేదిస్తూ గాంధీ రాజకీయాలలో చాలా లోతైన నైతిక అంశాలు ఉన్నాయని అర్థం చేసుకున్నారు. గాంధీకి సంబంధించి అహింస, సత్యాగ్రహం అనేవి 'ఒక గాఢమైన అనుభూతితో రూపుదిద్దుకున్న విశిష్ట తాత్వికతలు అని, వాటిలో మౌలికత ఉన్నదని, అది గణనీయమైనదేకాక విస్మరించరానిది'ని ఆయన స్పష్టం చేశారు. గాంధీ గురించిన సత్యాన్ని సర్కార్ సరిగానే గుర్తించారు. 'సత్యాన్వేషణే మానవ జీవిత లక్ష్యం' అని మహాత్ముడు అన్నారు. ఆయన ఇంకా ఇలా స్పష్టంగా చెప్పారు: 'అంతిమ సత్యాన్ని ఎవరూ పూర్తిగా తెలుసుకోలేరు. ఎవరికి వారు తమకు తోచిన పాక్షిక సత్యాన్ని ఇతరులపై హింస ద్వారా రుద్దడం పాపకార్యమే'. 1920ల తుదినాళ్ల పరిణామాలను చర్చిస్తూ గాంధీ గురించిన తన భిన్నాభిప్రాయాన్ని సుమిత్ సర్కార్ వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం సిద్ధించిన వేళ మతోన్మాదం పెచ్చరిల్లి, భయంకరమైన హత్యాకాండ చోటుచేసుకున్నప్పుడు హిందువులు--ముస్లింల మధ్య సామరస్యాన్ని నెలకొల్పేందుకు నౌఖాళీలో గాంధీ శాంతియాత్ర నిర్వహించారు. ఆ తరువాత ఢిల్లీ, కలకత్తాలో నిరాహార దీక్షలు చేశారు. ఈ పరిణామాలు 'మహాత్ముని అత్యుత్తమ ఘడియలు' అని సుమిత్ సర్కార్ అభివర్ణించారు. మోడరన్ ఇండియా చివరి అధ్యాయంలో ఆయన ఇలా రాశారు: 'మహాత్మాగాంధీ నిజమైన గొప్పతనం, విశిష్ట గుణాలు ఆయన జీవితం తుదినాళ్లలో స్పష్టంగా కనిపించాయి'. ప్రపంచం ముక్తకంఠంతో ఒప్పుకున్న సత్యమిది.కొత్తగా వెలుగులోకి వచ్చిన ప్రాథమిక చారిత్రక సమాచారం ఆధారంగా, అవసరమైతే తన అభిప్రాయాలను మార్చుకోవడానికి సుమిత్ సర్కార్ వెనుకాడేవారు కాదు. ఆయన గొప్ప వచన రచయిత. పదాలను గొప్ప నైపుణ్యంతో ఉపయోగించేవారు. తన భావాలను సూటిగా, స్పష్టంగా చెప్పేవారు. లయబద్ధమైన వాక్యాలను సృష్టించడంలో ఆయనకు ఆయనే సాటి. ఈ కారణంగానే ఆయన పుస్తకాలు విద్వత్ లోకాన్ని దాటి సామాన్య పాఠకులకు ప్రీతిపాత్రమయ్యాయి. సుమిత్ సర్కార్ స్ఫూర్తిదాయక అధ్యాపకుడు కూడా. ఆయన బోధనా విధానం గాంధేయ పద్ధతిలోను, ప్రజాస్వామ్యయుతంగాను ఉండేదని జర్నలిస్ట్ రావిశ్ కుమార్ ప్రశంసించారు.

## ఏపీలో 10,060 ఉద్యోగాలు..

మొదటిపేజీ తరువాయి

అమరావతి: నిరుద్యోగులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీపికబురు చెప్పింది. మొత్తంగా 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ 2026ను విడుదల చేసింది. మొత్తం నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నోటిఫికేషన్లు విడుదల చేయనున్నారు. గ్రూప్- 1లో 149 పోస్టులు, గ్రూప్- 2లో 673 ఉద్యోగాలు, విద్యాశాఖలో 2,995 పోస్టుల (టీచర్ పోస్టులు సహా)తో పాటు పోలీస్, ఫైర్, జైళ్లు, అటవీ, పశు సంవర్ధక, ఎక్సైజ్, ఇంజినీరింగ్, విద్యుత్ తదితర శాఖల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ఆర్థికశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

మొత్తం నాలుగు దశల్లో 10వేలకు పైగా ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయగా.. తొలి దశలో 1,523 పోస్టులు (ఉన్నత విద్యాశాఖ ద్వారా మే 15నే నోటిఫికేషన్ జారీ చేసి భర్తీ ప్రక్రియ ప్రారంభించారు).

రెండో దశలో 3,231 పోస్టులకు సెప్టెంబర్ 15న నోటిఫికేషన్ ఇస్తారు. దీనికింద గ్రూప్-1 ఉద్యోగాలతో పాటు, పోలీస్, అటవీ, పశుసంవర్ధక తదితర శాఖల్లో ఖాళీలను భర్తీ చేయనున్నారు.

మూడో దశలో 2,311 పోస్టులకు అక్టోబరు 15న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఇందులో భాగంగా గ్రూప్-2, ఎక్సైజ్, ఇంజినీరింగ్, విద్యుత్ శాఖల్లో భారీగా పోస్టులు భర్తీ చేస్తారు.

నాలుగో దశలో 2,995 పోస్టులకు అక్టోబర్ 15న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖలో టీచర్ పోస్టులతో పాటు మరికొన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తారు. పూర్తి వివరాలను ఈ కింది పీడీఎఫ్‌లో చూడొచ్చు.

## కనకదుర్గమ్మను దర్శించుకున్న గోవా సీఎం

మొదటిపేజీ తరువాయి

ఇంద్రకీలాద్రి: గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ శనివారం బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. పర్యటనలో భాగంగా ఇంద్రకీలాద్రికి చేరుకున్న ఆయనకు దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి (ఈఓ) వి.కె. శీనా నాయక్ స్వాగతం పలికారు. అనంతరం శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం.. శేషవస్త్రం, అమ్మవారి పవిత్ర చిత్రపటం, తీర్థప్రసాదాలను అందించారు. అంతకుమందు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న సీఎంకు.. జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ స్వగతం పలికారు.

## చంద్రంపాలెం పాఠశాల పేరు చెబితే.. వర్షం గుర్తొస్తుంది:

మొదటిపేజీ తరువాయి

విశాఖపట్నం: భీమిలి నియోజకవర్గం పరిధిలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్ (రాశీనివంప్త) సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రికి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. పాఠశాలలో సుమారు రూ. 6.48 కోట్లకు పైగా నిధులతో చేపట్టిన పునర్నిర్మాణ పనులను భీమిలి, గాజువాక ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు, జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్‌తో కలసి మంత్రి లోకేశ్ ప్రారంభించారు. స్కూల్‌లో తాగునీటి ఆర్వో ప్లాంట్, క్రికెట్, వాలీబాల్ కోర్టు, బాస్కెట్ బాల్, వాకింగ్ ట్రాక్‌ల ప్రాంగణాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో వాలీబాల్, బాస్కెట్ బాల్ ఆడి సందడి చేశారు. కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. "చంద్రంపాలెం పాఠశాలకు రావడం ఇది మూడో సారి. వచ్చిన ప్రతి సారీ భారీ వర్షం కురుస్తోంది. ఈ పాఠశాల పేరు చెబితే వర్షం గుర్తొస్తుంది. మంగళగిరి నియోజకవర్గంలో ఉన్న పాఠశాలకు కూడా నేను మూడుసార్లు వెళ్లలేదు" అని సరదాగా వ్యాఖ్యానించారు.

## భూభారతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: కిషన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి దండుకోగా.. కాంగ్రెస్ హయాంలో అది లక్షలాది ఎకరాలకు చేరిందని విమర్శించారు. హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

"రాత్రికి రాత్రే ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న భూములను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారు? ప్రజల వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం సీఎం ఇంటిని నిషేధిత జాబితాలో చేర్చారా? ధరణి స్థానంలో వచ్చిన భూభారతి నవ్వులపాలైంది. బీఆర్ఎస్ 10శాతం కమీషన్ తీసుకుంటే.. కాంగ్రెస్ 30 శాతం తీసుకుంటోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఓపెన్ భూములను అమ్మాలని చూస్తున్నారు. ప్రైవేటు భూముల్లో 50శాతం కమీషన్ అడుగుతున్నారు. ప్రభుత్వ భూముల్ని ఎందుకు అమ్ముతున్నారో సమాధానం చెప్పాలి. రియల్ ఎస్టేట్ కంపెనీలను బెదిరించి వాటాలు తీసుకుంటున్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక ఈ భూములపై మళ్లీ పరిశీలన చేస్తాం. ఎమ్మెల్యేకు ఇష్టంలేకపోతే ఆ భూమి 22ఏలోకి వెళ్లిపోతుంది. ఈ భూముల విషయంలో భాజపా లీగల్ సెల్ ప్రజలకు సహాయం అందిస్తోంది. ప్రాముఖ్యతను బట్టి ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తారు. విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ హయాంలో ఉన్న నిబంధనలే ఇప్పుడూ ఉన్నాయి" అని కిషన్ రెడ్డి అన్నారు.

## నేను కూడా ఒక పాలిటెక్నిక్ విద్యార్థినే..

మొదటిపేజీ తరువాయి

ఆ చదువుల ప్రాముఖ్యత, విద్యార్థుల కష్టాలు నాకు బాగా తెలుసు. రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యాసంస్థలకు 7 దశాబ్దాల సుదీర్ఘమైన, ఘనమైన చరిత్ర ఉంది. ఎందరో నిరుపేద విద్యార్థులు ఈ చదువుల ద్వారానే దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారన్నారు.జుఇవఎబ్అజవ దీత్శుఅఎష్ట్ర

రాష్ట్రంలోని 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న వారిలో 95 శాతం మంది నిరుపేద విద్యార్థులేనని.. నామమాత్రపు ఫీజులు కట్టి, నాణ్యమైన ఇంజనీరింగ్ స్థాయి విద్యను డిప్లొమాలోనే వాళ్లు నేర్చుకుంటున్నారు. పాలిటెక్నిక్‌ను ఐటీఐలో కలపడం వల్ల అది తన స్టేటస్ కోల్పోతుందన్నారు హరీశ్ రావు. ఇప్పుడున్న విధానం ప్రకారం పాలిటెక్నిక్ పూర్తవగానే ఇంజనీరింగ్ సెకండియర్‌లో నేరుగా అడ్మిషన్ పొందే అవకాశం ఉంది. ఐటీఐలతో కలిపితే మళ్లీ ఇంటర్మీడియట్ చదివితే తప్ప ఇంజనీరింగ్ సీటు రాని దుస్థితి వస్తుందని విద్యార్థులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఇంతటి పటిష్టమైన విద్యావ్యవస్థను తెలంగాణ విద్యాచట్టం పరిధి నుంచి తొలగించి, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి మార్చడం దారుణం. దీనివల్ల నిరుపేద విద్యార్థులు పాలిటెక్నిక్ చదువులకు దూరమై, వ్యవస్థ పూర్తిగా పతనమవుతుందని తెలిపారు. +వశీస్త్రత్శుజూష్ట్రఅఎ =వటవతీవఅఎవ

భవిష్యత్తు గురించి అయోమయంలో విద్యార్థులు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఇన్నాళ్లవుతున్నా నేటికి విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి లేడు. ఆ శాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే స్వయంగా చూస్తున్నా.. విద్యార్థుల సమస్యలను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. విద్యార్థులు, మేధావులతో ఎలాంటి ముందస్తు అభిప్రాయ సేకరణ చేపట్టకుండా, కనీస విధివిధానాలు కూడా బహిర్గతం చేయకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం వల్ల విద్యార్థులు తమ భవిష్యత్తు గురించి అయోమయంలో పడ్డారు. రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించిన.. పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలోకి విలీనం చేసే బిల్లును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## దౌత్యనీతి అంటే టీ20లే కాదు..

మొదటిపేజీ తరువాయి

అదే సమయంలో టీ20 మాదిరి.. మీడియాకు స్వల్పకాలిక పరిణామాలను అందించాల్సిన అవసరం ఉంది. అయితే, వాస్తవ ప్రపంచంలో టెస్ట్ మ్యాచ్‌లూ ఉంటాయి. వాటి ఫలితాలు తక్కువ సమయంలో తేలిపోయేవి కావు. పశ్చిమాసియా యుద్ధం ఒక టీ20 మ్యాచ్‌లా ఉంటుందని అంతా భావించారు. కానీ అది ఏకంగా టెస్ట్ సిరీస్, అంతకంటే ఎక్కువ కాలం సాగే ప్రక్రియగా మారింది" అని పేర్కొన్నారు.

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సరఫరా గొలుసు సమస్యలు, మార్కెట్ అంతరాయాలతో కూడిన నేటి అనిశ్చిత ప్రపంచంలో వ్యాపార సంస్థలు, ప్రభుత్వాల కోసం జైశంకర్ నాలుగు సూత్రాలను సూచించారు.

అంతరాయాల నుంచి తమను తాము కాపాడుకోవడం వ్యాపార సంస్థలు, ప్రభుత్వాల ప్రాధాన్య అంశంగా ఉండాలని చెప్పారు. 'డి-రిస్కింగ్' తన అతి పెద్ద మంత్రమని పేర్కొన్నారు.

ఎక్కువ మంది భాగస్వాములు, అధిక సంఖ్యలో సరఫరా వనరులపై ఆధారపడాలని సూచించారు. ఎన్ని ఎక్కువ ఆప్షన్లు ఉంటే అంత సురక్షితంగా ఉంటారని తెలిపారు.

ప్రపంచ మార్కెట్లు తరచూ భౌగోళిక రాజకీయాల వల్ల ప్రభావితమవుతాయనే విషయాన్ని అంగీకరించాలన్నారు. ఇంధనం, ఎరువులు, రవాణా వంటివి దీనికి ఉదాహరణలని తెలిపారు.

అంతరాయాలు ఎప్పుడైనా కలగవచ్చని అంచనా వేసి.. ముందుగానే ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. వైవిధ్యం పాటించి, పెట్టుబడులకు భద్రత కల్పించుకోవాలని చెప్పారు.

## సీఎం యోగి సహా 52మంది నేతలకు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు..!

మొదటిపేజీ తరువాయి

వచ్చే ఏడాది ఉత్తర్‌ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కీలక నేతల భద్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 52 మంది రాజకీయ నాయకులకు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు సమకూర్చినట్లు సమాచారం. ఈ జాబితాలో సీఎం యోగి ఆదిత్యనాథ్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతి సహా పలువురు నేతలు ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

ఒక్కో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధర రూ. 10 లక్షలు ఉంటుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వీటిని పొందిన నేతల లిస్టులో 11 మంది రాష్ట్ర మంత్రులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని మరో 98 మంది నేతలు, ప్రముఖ వ్యక్తులకు వివిధ స్థాయుల్లో భద్రత కల్పించనున్నట్లు తెలిపాయి. మరోవైపు ఎన్నికల సన్నాహాల్లో భాగంగా వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిని, అభ్యర్థుల అవకాశాలను అంచనా వేయడానికి భాజపా (దీజీ) సర్వేలు నిర్వహిస్తోంది.

## డీఎస్సీలో అవకతవకలు జరగలేదు..

మొదటిపేజీ తరువాయి

"మెగా డీఎస్సీ ద్వారా మేం ఉద్యోగాలిస్తే.. 350 పిటిషన్లు వేశారు. ఎక్కడ నాకు పేరు వస్తుందోనన్న అసూయతో కుట్రలు చేశారు. దుష్ప్రచారాలు చేసి అడ్డుకోవాలని ప్రయత్నించారు. డీఎస్సీలో అవకతవకలు జరగలేదు. జరగనివ్వను. మెరిట్‌పైనే పోస్టులు ఇచ్చిన సంప్రదాయం మాది.

మంచి పనులు చేయాలంటే రాజకీయాల్లోనూ ప్రక్షాళన అవసరం. ఎన్నికల్లో డబ్బు ప్రభావం లేకుండా చేయాలి. ఐదేళ్ల పాటు గొడ్డలి పార్టీ అరాచకాలను అందరూ చూశారు. విధ్వంసం, నేరాలు-ఘోరాలు నమ్ముకొని పనిచేసింది. నకిలీ మద్యం వల్ల 30వేల మంది చనిపోయిన పరిస్థితి. లక్షలాది మంది అనారోగ్యం బారినపడ్డారు. కలుషిత మద్యంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు" అని సీఎం మండిపడ్డారు.

## ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఓట్లడిగే ప్రసక్తే లేదు:

మొదటిపేజీ తరువాయి

నిజామాబాద్: నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి.. ఆ పేరుతో ఓట్లు అడిగే ప్రసక్తే లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో పర్యటించిన మంత్రి.. నగరంలో హౌసింగ్ టవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ ప్రవేశం చేసిన మహిళలకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు చెప్పారు. నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కొత్త టెక్నాలజీతో ఇందిరమ్మ మోడల్ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు.

## అక్రమ ఆయుధాల ముఠాపై దాడి.. అంతర్రాష్ట్ర నేరస్థుడి అరెస్టు



హైదరాబాద్: మల్కాజిగిరిలో అక్రమ ఆయుధాల ముఠాపై దాడులు నిర్వహించినట్లు సీపీ సుమతి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఒక అంతర్రాష్ట్ర నేరస్థుడిని పట్టుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు వివరాలు వెల్లడించారు. "నిందితులు తక్కువ ధరకు బిహార్ నుంచి ఆయుధాలు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయించేందుకు ప్రణాళికను రచించారు. బొల్లారం పోలీసులతో కలిసి ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాం. ఉత్తరప్రదేశ్‌లోని గాజీపూర్ జిల్లా దయాల్‌పూర్‌కు చెందిన పర్భన్స్ కుమార్ అదుపులోకి తీసుకున్నాం. అతడు ప్రస్తుతం పటాన్‌చెరులోని బిహార్ బస్తీలో నివాసం ఉంటున్నాడు.

నిందితుడి వద్ద నుంచి రెండు 9 ఎంఎం పిస్టల్స్, 17 లైవ్ రౌండ్లు, 3 మ్యాగజైన్లు, డబుల్ బ్యారెల్ తపంచా, 2 లైవ్ రౌండ్లు స్వాధీనం చేసుకున్నాం. డ్రై గంజాయి, గంజాయి చాక్లెట్ల విక్రయ కేసులోనూ గతంలోనూ ఇతడు అరెస్ట్ అయ్యాడు. 2024లో చర్లపల్లి పోలీసులు పర్భన్స్ కుమార్‌పై ఎన్‌డీపీఎస్ కేసు నమోదు చేశారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అక్రమ ఆయుధాల వ్యాపారంలోకి ప్రవేశించినట్లు దర్యాప్తులో తెలింది. అక్రమంగా తుపాకులు కలిగి ఉండటం తీవ్రమైన నేరం" అని సీపీ సుమతి పేర్కొన్నారు.

ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక
23-08-2026

# గంభీరవుపేట పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ

- ప్రజలకు చేరువగా.. జవాబుదారీతనంతో పోలీసింగ్
- గ్రామాల్లో రాత్రి పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి
- దొంగతనాల నివారణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించాలి
- వార్షిక తనిఖీల్లో గంభీరవుపేట పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



గంభీరవుపేట మండలం ప్రజాదివాస్ ఆగస్టు 22
పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించి, పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలకు మరింత చేరువగా ఉంటూ జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని సూచించారు.తనిఖీ సందర్భంగా ఎస్పీ పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సిబ్బంది ప్రదర్శించిన ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్‌ను పరిశీలించి అభినందించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ విధానం, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించారు.కేసుల విచారణలో వేగవంతమైన దర్యాప్తు, సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత దృక్పథం అవసరమని ఎస్పీ తెలిపారు. పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరును ప్రశంసించారు. నేరాల నియంత్రణలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, సీసీటీఎన్ఎస్‌లో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతిక విధానాలపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా గ్రామాలు, పట్టణాల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. దొంగతనాల నివారణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించి, కేసుల ఛేదనపై ఎప్పటికప్పుడు సమీక్ష చేపట్టాలని, అవసరమైతే ఆధునిక సాంకేతికతను వినియోగించి నేరస్తులను గుర్తించాలని సూచించారు. రికవరీ శాతం పెంచి బాధితులకు వారి సొత్తు తిరిగి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామాల్లో రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని, డయల్-112కు సమాచారం అందిన వెంటనే పెట్రోలింగ్, బ్లూ కోల్ట్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలని పేర్కొన్నారు. అనుమానితులు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్, ఎస్ఐ శ్రీకాంత్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వేములవాడ ఆలయంలో ఆకస్మిక తనిఖీలు

టీటీడీ ఎంక్వయిరీ కార్యాలయం, భారత్ గ్యాస్ గోదాంను పరిశీలించిన ఈవో రమాదేవి





వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 22
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని టీటీడీ ఎంక్వయిరీ (వసతి బుకింగ్) కార్యాలయం మరియు భారత్ గ్యాస్ గోదాంపై దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) శ్రీమతి ఎల్. రమాదేవి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.టీటీడీ ఎంక్వయిరీ కార్యాలయంలో వసతి బుకింగ్‌కు సంబంధించిన నగదు, రికార్డులు, రసీదులు, నిర్వహణ విధానాలను పరిశీలించిన ఈవో, అనంతరం భారత్ గ్యాస్ గోదాంలో సిలిండర్ల నిల్వ, స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ రికార్డులు, కార్యాలయ నిర్వహణను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఈవో రమాదేవి మాట్లాడుతూ, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నగదు లావాదేవీల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, స్టాక్ రిజిస్టర్లు మరియు కార్యాలయ రికార్డులను నిర్దేశిత విధానంలో నిర్వహించాలని ఆదేశించారు. గ్యాస్ సిలిండర్ల భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు గోదాంను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.భక్తులకు వసతి బుకింగ్ సేవలను వేగవంతంగా, మర్యాదపూర్వకంగా అందించాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలలో పర్యవేక్షకులు అరుణ్, రాజేందర్, ప్రజాసంబంధాల అధికారి (పీఆర్ఓ) పెరుక శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ తిరుపతి తదితర ఆలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# మట్టిలో మాణిక్యం.. అమెరికా వేదికపై తెలంగాణ ఒగ్గు కథ వైభవం తాతకు తగ్గ మనవడిగా మిద్దె వినీత్‌కు ఘన సన్మానం

- సిలికాన్ ఆంధ్ర మహాసభలో తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిన యువ కళాకారుడు





వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 22
తెలంగాణ జానపద కళా వైభవాన్ని అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పిన యువ ఒగ్గు కథ కళాకారుడు మిద్దె వినీత్‌కు వేములవాడలో ఘన సన్మానం నిర్వహించారు. ఒకప్పుడు ఒగ్గు కథ ప్రదర్శనలతో గ్రామ స్థాయి నుంచి దేశ విదేశాలకు తెలంగాణ ఖ్యాతిని విస్తరించిన ప్రముఖ జానపద కళాకారుడు కీ.శే. మిద్దె రాములు గారి వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఆయన మనవడు మిద్దె వినీత్ అమెరికాలోని సిలికాన్ ఆంధ్ర ఒక్లాండ్ మహాసభ వేదికపై ఒగ్గు కథ ప్రదర్శన ఇచ్చి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.అమెరికా పర్యటన అనంతరం స్వగ్రామమైన వేములవాడకు వచ్చిన మిద్దె వినీత్‌తో పాటు ఆయన తండ్రి మిద్దె పరుశరాములు గారిని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ పట్టణ శాఖ ఆధ్వర్యంలో, నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు నాయకత్వంలో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ వేదికలపై పరిచయం చేస్తున్న మిద్దె వినీత్ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. తెలంగాణ జానపద కళల పరిరక్షణ, ప్రచారంలో ఆయన మరింత ముందుకు సాగాలని కోరుతూ, శ్రీ రాజరాజేశ్వర స్వామి మరియు ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని శుభాకాంక్షలు తెలిపారు."తాత వారసత్వాన్ని నిలబెట్టి.. తెలంగాణ ఒగ్గు కథకు ప్రపంచ వేదికపై కొత్త గుర్తింపు తీసుకొచ్చిన యువ కళాకారుడు మిద్దె వినీత్" అంటూ పలువురు ప్రశంసించారు.

# ప్రణాళిక ప్రకారం రాజన్న ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం
- నిత్యాన్నదాన సత్రం, బద్దిపోచమ్మ ఆలయ నిర్మాణాలపై సమీక్ష

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 22
వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను




ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం నిర్మాణం, బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనులపై అధికారులను అడిగి తెలుసుకున్న ఆమె, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు.నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని, ఆలయ అభివృద్ధి పనుల కోసం అవసరమైన చోట కూలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. నిర్మాణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.అనంతరం బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్ణయించిన గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఈ భీమ్లా నాయక్, ఆలయ ఈవో రమాదేవి, డీఈ శాంతయ్య, మోతీలాల్ స్థపతి, సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పచ్చని పోలీస్ కార్యాలయమే లక్ష్యం

- పరిశుభ్రత-వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- మొక్కలు నాటి సంరక్షణపై పోలీస్ సిబ్బందికి సూచనలు







రాజన్న సిరిసిల్ల జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 22
పర్యావరణ పరిరక్షణతో పాటు కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం పరిశుభ్రత, వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పాల్గొని పోలీస్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.ముందుగా కార్యాలయ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. అనంతరం పచ్చదనం పెంపొందించే ఉద్దేశంతో పలు రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది మొక్కల సంరక్షణకు కట్టుబడి పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ, పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యకరమైన జీవనానికి ఎంతో అవసరమని తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు, పోలీస్ సిబ్బంది ఆహ్లాదకరమైన వాతావరణంలో తమ పనులు నిర్వహించేందుకు పచ్చదనం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు.వనమహోత్సవ కార్యక్రమాలు కేవలం మొక్కలు నాటడానికే పరిమితం కాకుండా, వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దినప్పుడే అసలు ఫలితం ఉంటుందని ఎస్పీ అన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, కార్యాలయాల్లో ఇదే తరహా కార్యక్రమాలు కొనసాగించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐలు మధుకర్, సురేష్, రమేష్, సీఐలు మొగిలి, మధుకర్, ఎస్ఐ కిరణ్ కుమార్, ఆర్ఎస్ఐలు రాజు, శ్రవణ్, సాయికిరణ్, దిలీప్, రాజు తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇలియాస్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న పల్లె రమేష్ గౌడ్..

ప్రజాదివాస్

రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకులు, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ తనయులు మహమ్మద్ ఇలియాస్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్వంచ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పల్లె రమేష్ గౌడ్ పాల్గొని ఇలియాస్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇలియాస్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇలియాస్ ప్రజల కోసం, ప్రజల మధ్య నిరంతరం సేవలందిస్తూ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో ఆయన మరింత ముందుకు సాగాలని పల్లె రమేష్ గౌడ్ అభిలషించారు. అనంతరం ప్రభుత్వ సలహాదారు శ్రీ మహమ్మద్ షబ్బీర్ అలీని కూడా పల్లె రమేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల పాల్వంచ మండల అభివృద్ధి కోసం రూ.28 కోట్ల నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మండల అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో పాల్వంచ మండలంలో అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని ఆయన పేర్కొన్నారు.



# జీజీహెచ్‌లో పసికందు మృతి.. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆందోళన..

ప్రజాదివాస్

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో పసికందు మృతి చెందడం కలకలం రేపింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. లింగంపేట మండలం ఎక్కపల్లి గ్రామానికి చెందిన స్వరూప (20), భర్త సరిచంద్, శుక్రవారం రాత్రి ప్రసవం కోసం కామారెడ్డి జీజీహెచ్‌లో చేరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో ఆమెకు నార్మల్ డెలివరీ జరిగి మగ శిశువు జన్మించినప్పటికీ, అప్పటికే శిశువు మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. ప్రసవం విషయంలో సర్జరీ చేయాలని కుటుంబ సభ్యులు కోరినప్పటికీ వైద్యులు అందుకు అంగీకరించకుండా నార్మల్ డెలివరీ కోసం ప్రయత్నించారని, దీంతో శిశువు మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యమే తమ బిడ్డ మృతికి కారణమంటూ ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై ఆసుపత్రి అధికారులు స్పందించి పూర్తి వివరాలను వెల్లడించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. అయితే శిశువు మృతికి అసలు కారణం ఏమిటనే విషయం వైద్యుల అధికారిక వివరణ, వైద్య రికార్డులు మరియు విచారణ అనంతరం స్పష్టత రావాల్సి ఉంది.

# చందుర్తిలో ఘోర రోడ్డు ప్రమాదం

- పల్టీ కొట్టిన కారు.. మహిళ మృతి, ఐదుగురికి గాయాలు హల్దీ వేడుకకు వెళ్తుండగా విషాదం
- ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి ప్రమాదం చిన్నారితో సహా క్షతగాత్రులు.. ముగ్గురి పరిస్థితి విషమం

చందుర్తి మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 22

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు సభ్యులు కారులో చందుర్తిలో నిర్వహించే హల్దీ వేడుకకు వెళ్తుండగా, లింగంపేట సమీపంలో కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, చిన్నారితో సహా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ఇద్దరికి వేములవాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. వేడుకకు ఆనందంగా వెళు_న్న కుటుంబాన్ని ఈ ప్రమాదం తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఘటనతో రుద్రంగి, చందుర్తి ప్రాంతాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




# సంస్కృత పాఠశాల, కళాశాలలో ఆకస్మిక తనిఖీలు

- విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలి: డీఈఓ నవీన్ కుమార్





వేములవాడ ప్రజాదివాస్ ఆగస్టు 22

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రాజరాజేశ్వర సంస్కృత పాఠశాల, కళాశాలలో ఆలయ డీఈఓ శ్రీ నవీన్ కుమార్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీలలో విద్యార్థుల హాజరు, అధ్యాపకుల హాజరు, తరగతుల నిర్వహణ, విద్యా బోధన విధానాలు మరియు పాఠశాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి విద్యా సంబంధిత సమస్యలు, ఇతర సౌకర్యాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, పోషక విలువలను పరిశీలించిన డీఈఓ, ఎల్లప్పుడూ నాణ్యమైన మరియు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, శ్రేయస్సుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమైన నవీన్ కుమార్, ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. తరగతులను క్రమశిక్షణతో నిర్వహిస్తూ విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలను పెంపొందించేలా బోధన సాగించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై శ్రద్ధగా చదువుకోవాలని, మంచి క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. ఈ ఆకస్మిక తనిఖీల ద్వారా పాఠశాల, కళాశాలలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందేలా చర్యలు కొనసాగుతాయని డీఈఓ తెలిపారు. ఈ వివరాలను శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి (పీఆర్ఓ) పెరిక శ్రీనివాస్ వెల్లడించారు.?

# సినారె విగ్రహ సాక్షిగా రెడ్డి భవన్ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయొద్దు

- అసాంఘిక కార్యకలాపాలపై మండిపడ్డ మెరుపుల రాకేష్ రెడ్డి
- భవనం పేరు మార్చాలి లేదా సినారె విగ్రహాన్నైనా తరలించాలి
- నిర్వాహకులు, ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్



వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 22

వేములవాడలోని నంది కామన్--మారుపాక రోడ్డులో ఉన్న రెడ్డి భవన్ ఇటీవల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారడంపై జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి స్వగ్రామమైన హన్మాజీపేటకు చెందిన మెరుపుల రాకేష్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు, దూరప్రాంత సందర్శకులు, రెడ్డి సమాజ బంధువుల సౌకర్యార్థం నిర్మించిన ఈ భవనం ఈ రోజు ఆత్మ గౌరవాన్ని కోల్పోవడంపై ఆయన మండిపడ్డారు. తెలంగాణ గర్వకారణమైన సినారె విగ్రహం ముందే ఇలాంటి పనులు జరగడం దురదృష్టకరమని, ఇది ఏ ఒక్కరిపైనో చేసిన వ్యక్తిగత విమర్శ కాదని, సమాజ గౌరవానికి సంబంధించిన విషయమని స్పష్టం చేశారు. 'రెడ్డి భవన్' అనే పేరు వెనుక ఒక సమాజపు ఆత్మగౌరవం దాగి ఉందని, కేవలం ధనార్జనే ధ్యేయంగా భావించి సమాజానికి తలవంపులు తెచ్చే కార్యకలాపాలు నిర్వహించడం బాధాకరమన్నారు. నిర్వాహకులు వెంటనే స్పందించి ఇలాంటి పనులకు స్వస్తి పలకాలని, లేనిపక్షంలో 'రెడ్డి భవన్' అనే పేరును తొలగించి, మా గ్రామ ముద్దుబిడ్డ ప్రపంచ సాహితీవేత్త సినారె విగ్రహాన్ని మరో గౌరవప్రదమైన ప్రదేశానికి తరలించాలని డిమాండ్ చేశారు. 'బలగం' వంటి చిత్రాల ద్వారా సంస్కృతిని చాటిన పవిత్రమైన రాజన్న నేలపై ఇలాంటి పరిస్థితులు తలెత్తడం సమంజసం కాదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, రాజన్న ఆలయ పవిత్రతను, రెడ్డి సమాజ ఆత్మగౌరవాన్ని కాపాడాలని నిర్వాహకులను, ప్రభుత్వాన్ని కోరారు.

# వేములవాడలో పోలీసుల ఆకస్మిక సోదాలు

- డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో లాడ్జీల్లో విస్తృత తనిఖీలు 40 మంది సిబ్బందితో మూడు బృందాలుగా ఆపరేషన్
- సందర్శకుల నమోదు, సీసీ కెమెరాల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టడమే లక్ష్యం



వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 22

వేములవాడ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణాన్ని మూడు బృందాలుగా విభజించి సుమారు 40 మంది పోలీసు సిబ్బంది వివిధ ప్రాంతాల్లోని లాడ్జీల్లో విస్తృత సోదాలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా లాడ్జీలలో బస చేసిన సందర్శకుల వివరాలు, గుర్తింపు పత్రాలను పరిశీలించిన పోలీసులు, నిర్వాహకులు నిర్వహిస్తున్న రిజిస్టర్లను తనిఖీ చేశారు. అలాగే సీసీ కెమెరాల పనితీరు, రికార్డింగ్ ఫుటేజీని కూడా పరిశీలించారు. పట్టణంలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం, అక్రమ మరియు అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా ఈ ప్రత్యేక సోదాలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. లాడ్జీల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే యాజమాన్యాలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# వేములవాడ దేవస్థాన గోశాలలను పరిశీలించిన ఈవో

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 22



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలోని కట్టకింది గోశాల మరియు తిప్పపురం గోశాలలను దేవస్థాన ఈవో ఎల్. రమాదేవి పరిశీలించారు. గోశాలల్లో గోవులకు అందిస్తున్న పచ్చి గడ్డి, దాణా, తాగునీరు, వైద్య సేవలు, పరిశుభ్రత, సంరక్షణ గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోవులకు అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించి, వాటికి దాణా వేసి గోవులు సక్రమంగా తింటున్నాయా, ఆహారం నాణ్యత ఎలా ఉందో పరిశీలించారు. గోవుల ఆరోగ్య సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఈవో ఎల్. రమాదేవి మాట్లాడుతూ, శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన మొక్కు "కోడె మొక్కు" అని తెలిపారు. భారతదేశంలోని ఇతర దేవాలయాల్లో కనిపించని ప్రత్యేక సంప్రదాయం వేములవాడలో కొనసాగుతుండడం విశేషమన్నారు. భక్తులు తమ కోరికలు నెరవేరిన అనంతరం స్వామివారికి కోడెను సమర్పించడం ధర్మదేవతకు చేసే పవిత్ర సమర్పణగా భావిస్తారని పేర్కొన్నారు. కోడె మొక్కు గోసంరక్షణ, ధర్మ పరిరక్షణ, భక్తి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. దేవస్థానానికి సమర్పించే కోడెలు, గోవులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, నాణ్యమైన మేత, స్వచ్ఛమైన నీరు, సకాలంలో వైద్య సేవలు అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజేష్ , ఏఈఓ మహేష్, పర్యవేక్షకులు అరుణ్, గోశాల వైద్యుడు మరియు ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా రోగులకు పండ్ల పంపిణీ..



ప్రజాదివాస్
మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా బీబీపేట, దోమకొండ మండల కేంద్రాల్లో మెగా అభిమాని కొరివి నరసింహులు ముదిరాజ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొరివి నరసింహులు మాట్లాడుతూ. మెగాస్టార్ చిరంజీవి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. చిరంజీవి తన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకోవడంతో పాటు సేవా కార్యక్రమాల ద్వారా నూతన తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. చిరంజీవి మరిన్ని మంచి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించాలని కోరారు. చిరంజీవి అభిమానులుగా ప్రతి సంవత్సరం జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తున్నామని, భవిష్యత్‌లో కూడా పలు సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, రాజు, ఎల్లయ్య, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడ డివిజన్ రెవెన్యూ ఉద్యోగులకు పిలుపు..

### -ఆగస్టు 23న పోచంపాడులో రెవెన్యూ కాంక్లేవ్

ప్రజాదివాస్
కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ పరిధిలోని రెవెన్యూ ఉద్యోగులు ఆగస్టు 23న నిజామాబాద్ జిల్లా పోచంపాడులో నిర్వహించనున్న రెవెన్యూ కాంక్లేవ్‌కు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ పాలన అధికారుల సంఘం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా బాన్సువాడ డివిజన్ గ్రామ పాలనాధికారుల సంఘం అధ్యక్షులు దాసరి సాయిలు మాట్లాడుతూ, రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు, విధులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ఈ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని రెవెన్యూ ఉద్యోగులందరూ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు లచ్చిరెడ్డి అధ్యక్షతన ఈ రెవెన్యూ కాంక్లేవ్ జరగనుంది. ఉద్యోగుల సమస్యలు, పరిపాలనకు సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కిషోర్, ఉపాధ్యక్షులు సత్యం, శ్రీనివాస్, కోశాధికారి కపిల్‌తో పాటు పలువురు జీపీఓలు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొని కాంక్లేవ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## ఫార్మసీ కౌన్సిల్ సభ్యునిగా చిలువేరి మారుతి నియామకం..

### -రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఉత్తర్వులు జారీ

ప్రజాదివాస్
తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ సభ్యునిగా కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన చిలువేరి మారుతిని రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఫార్మసీ కౌన్సిల్ సభ్యులుగా ఐదుగురికి ప్రభుత్వం అవకాశం కల్పించగా, అందులో కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన చిలువేరి మారుతికి స్థానం లభించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. జిల్లాకు చెందిన వ్యక్తికి రాష్ట్రస్థాయి కీలక బాధ్యత లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిలువేరి మారుతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఫార్మసీ కౌన్సిల్ సభ్యునిగా అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ఫార్మసీ రంగానికి చెందిన పెద్దలు, శ్రేయోభిలాషులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఫార్మసీ రంగ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.



# అశ్వారావుపేటలో హద్దులు దాటిన అక్రమ ఇసుక దందా: మైనర్ల చేతిలో ట్రాక్టర్లు.. కళ్లప్పగించిన అధికారులు!

ప్రజాదివాస్
అశ్వారావుపేట మండలంలో అక్రమ ఇసుక రవాణా నిత్యకృత్యంగా మారింది. ఆర్టీఓ (రవాణా శాఖ), పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల కళ్లముందే ఎటువంటి కాగితాలు, పత్రాలు లేని ట్రాక్టర్లు యథేచ్ఛగా రోడ్లపై నడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ నాయకుల అండదండలతో అక్రమార్కులు ప్రజలకు రావలసిన సహజ వనరుల ఆదాయానికి గండి కొడుతూ కోట్లు ఆర్జిస్తున్నారు.?తనిఖీలు లేవు.. పత్రాలు లేని వాహనాలకు అడ్డూ లేదు!రవాణా శాఖ అధికారులు కనీసం రహదారులపైకి వచ్చి వాహనాల కాగితాలను తనిఖీ చేసిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, చివరకు నంబర్ ప్లేట్లు కూడా లేని ట్రాక్టర్లను మైనర్లు నడుపుతుంటే అధికారులు ఏ రకమైన నిద్రపోతున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అప్పుడప్పుడు పోలీసులు నామకార్థం తనిఖీలు చేసి నామమాత్రపు కేసులు, ఫైన్లకే పరిమితం చేస్తున్నారే తప్ప, ఈ అక్రమ రవాణాను శాశ్వతంగా అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.?రాజకీయ అండదండలతో చెలరేగుతున్న మాఫియా ఇసుక అక్రమ రవాణా వెనుక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల హస్తం ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వానికి రావాల్సిన మైనింగ్ రాయల్టీని కొల్లగొడుతూ, తమ స్వార్థం



కోసం నాయకులు ఈ దందాను ప్రోత్సహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. అధికారులతో ఉన్న పరిచయాలు, రాజకీయ ఒత్తిళ్లతో చట్టాన్ని తమ జేబులో పెట్టుకుని అక్రమార్కులు వ్యవహరిస్తున్నారు. ?రోడ్లపై మృత్యుఘంటికలు -- మైనర్ల చేతిలో వాహనాలు ఎటువంటి పర్మిషన్లు లేకుండా, డ్రైవింగ్ లైసెన్స్ కనీసం వయస్సు కూడా లేని మైనర్ యువకులు ఇసుక ట్రాక్టర్లను నడుపుతూ రోడ్లపై మృత్యుఘంటికలు మోగిస్తున్నారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు తోలుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.?అధికారుల నిర్లక్ష్యం - నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారం రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖల అధికారులు కళ్లముందే ఈ అక్రమ రవాణా జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు నిలదీస్తున్నారు. మామూళ్ల మత్తులో జోగుతున్నారా లేక అధికారులకు చీమకుట్టినట్టైనా లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోజురోజుకూ ఈ దందా హద్దులు దాటుతున్నప్పటికీ నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నారే తప్ప కఠిన చర్యలు శూన్యమని విమర్శిస్తున్నారు.?రేపు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?మైనర్ల చేతికి ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్లు ఇవ్వడం, లైసెన్సులు లేకపోవడం వల్ల ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని బాటసారులు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. రేపు ఏదైనా విపత్తు జరిగి అమాయకుల ప్రాణాలు పోతే దానికి బాధ్యత ఎవరు వహిస్తారు? ట్రాక్టర్ యజమానులా? లేక కంటిముందే అక్రమాలు జరుగుతున్నా మౌనం వహిస్తున్న అధికారులా? అని ప్రజలు నిలదీస్తున్నారు.?ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. లైసెన్స్ లేకుండా, మైనర్లతో ట్రాక్టర్లు నడిపిస్తున్న యజమానులపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలి. అశ్వారావుపేట మండలంలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపాలి. మళ్లీ ఈ వ్యవహారం పునరావృతం కాకుండా అక్రమ వాహనాలను సీజ్ చేసి, నిర్భయంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మండల ప్రజల ప్రాణాలను, ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# గిరిజనుల పోడు భూముల్లో బలవంతపు ప్లాంటేషన్ ఆపాలి..

### -జిల్లా ఫారెస్ట్ కార్యాలయం ముట్టడి

### పోడు రైతుల జోలికొస్తే తీవ్ర పరిణామాలు

### -సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ భూములు ఇవ్వకుంటే ఎర్రజెండాలు పాతి స్వాధీనం చేసుకుంటాం

### -వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు

ప్రజాదివాస్
గిరిజనులు వారసత్వంగా సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అటవీ అధికారులు చేపడుతున్న బలవంతపు ప్లాంటేషన్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ధర్నాకు సీపీఎం జిల్లా కార్యదర్శి కే. చంద్రశేఖర్ మద్దతు తెలిపారు. ధర్నాలో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తరతరాలుగా గిరిజనులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పోడు భూములను అధికారులు బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఇప్పటికే ఆర్థికంగా వెనుకబడిన గిరిజన రైతుల భూముల్లో వారి అనుమతి లేకుండా ప్లాంటేషన్ చేపట్టడం అన్యాయమని విమర్శించారు. పోడు రైతుల జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గిరిజనుల హక్కులను కాపాడాలని, పోడు భూముల్లో బలవంతపు ప్లాంటేషన్‌ను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఫారెస్ట్ అధికారులతో నాయకులు చర్చలు జరిపారు. గిరిజనుల పోడు భూముల్లో బలవంతంగా ప్లాంటేషన్ చేపట్టబోమని అధికారులు హామీ ఇచ్చినట్లు చంద్రశేఖర్ తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు మాట్లాడుతూ.. గిరిజనులకు హక్కుగా రావాల్సిన భూములను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి గిరిజనులకు భూములు ఇవ్వకపోతే ఎర్రజెండాలు పాతి భూములను స్వాధీనం చేసుకునే ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్‌తో పాటు నాయకులు సుభాష్, రమేష్, గణేష్, సీట్యా, కమల, సరోజ, శారద తదితరులు పాల్గొన్నారు.



# అశ్వారావుపేట 100 పడకల ఆసుపత్రికి బాబూ జగజ్జీవన్ రామ్ గా నామకరణం చేయాలి

ప్రజాదివాస్
అశ్వారావుపేట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ని పార్టీలకు అతీతంగా అందరూకలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ముఖ్య ఉద్దేశం ఏమిటి అనగా అశ్వారావుపేట వంద పడకల ఆసుపత్రి కి బాబు జగ్జీవన్ రామ్ ఏరియల్ హాస్పిటల్ గా నామకరణం చేయాలని, అలాగే బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం హాస్పిటల్ లోపల ఏర్పాటు చేయడం గురించి చర్చించడం జరిగింది. చర్చలో పాత ఎంపీడీవో ఆఫీస్ నుంచి కొత్త ఎంపీడీవో ఆఫీస్ ,ఎమ్మార్వో ఆఫీస్, గిరిజన భవనం ,ఐ సి డి ఎస్ ఆఫీస్ ,ఎమ్మెల్యే క్వార్టర్స్ ఇప్పుడు నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి కూడా పేరాయిగూడెం వాసులవేనని,




దేనికి కూడా మేము ఏమీ కోరలేదు. కావునా ఇప్పుడు ఆ ఇళ్ల పక్కన నిర్మిస్తున్నటువంటి ఈ ఒక్క 100 పడకల ఆసుపత్రికి బాబు జగ్జీవన్ రామ్ పేరు పెట్టి మాకు తగిన న్యాయం చేయాలని కోరడం జరిగింది . అలాగే కుదిరితే రింగ్రోడ్డు సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వెనుక కూడా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరడమైనది . దీనిపై ఎమ్మెల్యే జారే గారు స్పందించి నా వంతుగా నేను కృషి చేస్తానని హామీ ఇచ్చినారు. దీని కొరకు మన కౌన్సిలర్లు నార్లపాటి మహేష్, నార్లపాటి మౌనిక( రాంబాబు), నార్లపాటి దివాకర్, కో ఆప్షన్ సభ్యురాలు తగరం నిర్మల పూర్తి బాధ్యత తీసుకొని ఎమ్మెల్యేతో లోకల్ నాయకులతో కొట్లాడి అయినా ఈ కార్యక్రమాలు రెండు పూర్తి చేస్తారని కోరుతూ, ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లిన వారిలో జుజ్జూరపు రాంబాబు , నార్లపాటి సుబ్బారావు,కలపాల బాబురావు, నార్లపాటి నాగరాజు ,నార్లపాటి సోమరాజు, తగరం హరి, గంధం ఆనంద్,నార్లపాటి రామకృష్ణ, నార్లపాటి సురేష్,నార్లపాటి నవీన్, తగరం నాగరాజు, మోటూరీ రాజేష్, సంతోషం, అయినంపూడి ప్రదీప్ ,నార్లపాటి బన్ను, నార్లపాటి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఖాదీరాబాద్ 12వ వార్డు సభ్యురాలు పల్లె సురేఖ

ప్రజాదివాస్
ఆందోల్ నియోజకవర్గం వట్టిపల్లి మండలం ఖాదీరాబాద్ గ్రామంలో మంచి మనసు చాటుకున్న 12వార్డు సభ్యురాలు పల్లె. సురేఖ - యాదగిరి,సంగారెడ్డి జిల్లా, వట్పల్లి మండలం,ఖాదిరాబాద్ గ్రామంలోని దాసరి యాదయ్య కుమారుడు ఇటీవల ఆగస్టు 20 తేదీన రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది, ఆ విషయం తెలుసుకున్న ఆమె వారి కుటుంబాన్ని పరామర్శించి, 50కేజీ ల బియ్యం బస్తా అందజేయడం జరిగింది. ,



# జీవో 97 రద్దు చేయాలి.. పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలి

**- మండల వ్యాప్తంగా కదిలి వచ్చిన పార్టీ శ్రేణులు**

ప్రజాదివాస్

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్‌ను దెబ్బతీసే జీవో 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు మండల పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. అశ్వారావుపేట తహసీల్దార్ కార్యాలయం ముందు హైవే రోడ్డుపై రాస్తారోకో చేపట్టడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. బీఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు మండల వ్యాప్తంగా కదిలి వచ్చి పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీవో 97తో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థ దెబ్బతింటుందని, విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకోవద్దని, పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే ఈ నల్ల జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ డాక్టర్ భూక్యా ఉదయ జ్యోతి ఆధ్వర్యంలో అశ్వారావుపేట తహసీల్దార్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయుకులు భూక్య ప్రసాదు, జుజ్జురపు శ్రీరామ్ మూర్తి, జూపల్లి రామరణ రావు,గుడవర్తి వెంకటేశ్వరరావు, జాలిపల్లి శ్రీరామ్ మూర్తి, జక్కుల రాంబాబు, మందపాటి



మోహన్ రెడ్డి,మోటూరి మోహన్,ఆరెపల్లి గోవింద్, పాలవలస జీవన్ రావు, శెట్టిపల్లి రఘురాం, తగరం జగన్నాథం, సోమని రమేష్, బాలి కిరణ్, ఉప సర్పంచ్ సంగీతం రాజు,మాజీ సర్పంచ్ సోని ప్రసాద్, శ్రీకాళహస్తి,అప్పారావు, తోట వెంకటస్వామి, గెడ్డం మంగరాజు, మనోహర్, కొనాకళ్ల గంగయ్య, పార్టీ శ్రేణులు, విద్యార్థి, యువజన నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేట పట్టణంలో నూతనంగా ఏర్పడిన ఎస్ వి మార్ట్ ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణారెడ్డి

**- ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు)**

ప్రజాదివాస్

ఆందోల్ నియోజకవర్గం అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో యూనియన్ బ్యాంక్ ఎదురుగా కోట నరేష్ గారు నూతనంగా



ఏర్పాటు చేసిన యస్ వి మార్ట్ ను గౌరవ మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణ రెడ్డి గారు రిబ్బన్ కట్ చేసి మార్ట్ ను ప్రారంభం చేయడం జరిగింది వారితో పాటుగా వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు )గారు మాజీ కౌన్సిలర్ న్యాయవాది అల్లే శ్రీకాంత్ గారు కోట సాయిబాబా గారు గజవాడ రాజేశ్వర్ గారు, బీపేట సంపత్ కుమార్ గారు, పోల రఘునాథ్ గారు, కోవూరి విజయ్ కుమార్ గారు, పురం రఘు గారు, గంగోత్రి శ్రీనివాస్ గారు, గాజుల పవన్ కుమార్ గారు, గొర్లకాడి కుమార్ గారు ఇంకా ఇతర పెద్దలు కుటుంబ సభ్యులు పుర ప్రముఖులు పాల్గొన్నారు

# జర్నలిస్టుపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**- తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర నాయకులు చెల్మెడ అనిల్ కుమార్**

ప్రజాదివాస్

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని భూపాలపల్లి జిల్లాలో దళిత జర్నలిస్టు పుల్ల రవీందర్ ఇంట్లోకి చొరబడి దాడికి పాల్పడిన ఘటనను తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం సభ్యులు తీవ్రంగా ఖండించారు.ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర నాయకులు చెల్మెడ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. జర్నలిస్టు పుల్ల రవీందర్ ఇంట్లోకి చొరబడి దాడి చేయడం ప్రజాస్వామ్య



విలువలకు విరుద్ధమని అన్నారు.జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.దాడి ఘటనపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి గురైన జర్నలిస్టుకు రక్షణ కల్పించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.జర్నలిస్టు పుల్ల రవీందర్‌పై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం తరపున చెల్మెడ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు.

# మేజర్ సర్జరీలు కూడా చేయగలిగే పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా కమ్యూనిటీ సెంటర్లు మంత్రి దామోదర రాజనర్సింహ



ప్రజాదివాస్

ఏరియా హాస్పిటళ్లు, డిస్ట్రిక్ట్ హాస్పిటళ్లు అభివృద్ధి చెందాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. టీచింగ్ హాస్పిటళ్లతో సమానంగా స్థానికంగానే ప్రజలకు వైద్య సేవలకు అందించే అవకాశం జిల్లా, ఏరియా హాస్పిటళ్లకు ఉందని మంత్రి పేర్కొన్నారు. టీచింగ్ హాస్పిటళ్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తే.. జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యునిటీ హెల్త్ సెంటర్లలో 1616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను రిక్రూట్ చేశామని మంత్రి గుర్తు చేశారు. డాక్టర్లు, సిబ్బందితో పాటుగా అవసరమైన అన్ని సౌకర్యాలను కూడా కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ ( డి ఎస్ హెచ్ ) పరిధిలోని ప్రభుత్వ హాస్పిటళ్ల పనితీరు, వైద్య సేవలు, మౌలిక వసతులు, మానవ వనరులు, పరికరాలు తదితర అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, అన్ని జిల్లాల డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ ( డి సి హెచ్ ఎస్ లు),

# తూర్పుగౌని ముదిరాజ్ సంఘము కు ఆనుకొని ఉన్న కందకము ఆక్రమించుకొని ఎటువంటి పర్మిషన్ లేకుండా అక్రమ కట్టడలు

**- వార్డు ప్రజలు సంఘం సభ్యులు అడ్డుకొని మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు**

ప్రజాదివాస్

ఆందోల్ నియోజకవర్గం జోగిపేట పట్టణంలోని తూర్పు గౌని ముదిరాజ్ సంఘానికి ఆనుకొని ఉన్న కందకం ఖాళీ స్థలాన్ని ( శ్రీ అయ్యప్ప విజయ్ ) అక్రమంగా ఆక్రమించి, ఎటువంటి అనుమతులు లేకుండా చేపడుతున్న అనధికార నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయించి, చట్టపరమైన చర్యలు తీసుకోవలసిందిగా అత్యవసర ఫిర్యాదు. మహోదయులకు, మేము జోగిపేట పట్టణంలోని తూర్పు గౌని ముదిరాజ్ సంఘంకు చెందిన సభ్యులము. మా సంఘ ప్రాంగణానికి ఆనుకొని, వెనుక వైపున ఉన్న కందకం ఖాళీ స్థలాన్ని శ్రీ అయ్యప్ప విజయ్ ఎటువంటి హక్కు పత్రాలు, స్వామ్య ఆధారాలు లేదా చట్టబద్ధమైన మున్సిపల్ అనుమతులు లేకుండా అక్రమంగా ఆక్రమించి, అక్కడ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ అక్రమ ఆక్రమణ మరియు నిర్మాణ విషయమై ఇప్పటికే ఒకసారి గౌరవ కమిషనర్ గారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు/వినతిపత్రం సమర్పించాము. దానిపై స్పందించిన గౌరవ కమిషనర్ గారు స్వయంగా స్థలాన్ని సందర్శించి, సంబంధిత వ్యక్తిని పనులు నిలిపివేయాలని స్పష్టంగా ఆదేశించినప్పటికీ, ఆ ఆదేశాలను పూర్తిగా లెక్కచేయకుండా ప్రస్తుతం మళ్లీ ఎవరికీ తెలియకుండా, ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా నిర్మాణ పనులను



ప్రారంభించారు. ఇది సాధారణ నిర్మాణ వివాదం కాదని, ప్రజా ప్రయోజనానికి సంబంధించిన ఖాళీ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి, అధికారుల ఆదేశాలను సైతం ధిక్కరిస్తూ నిర్మాణం కొనసాగిస్తున్న తీవ్రమైన విషయం అని మా సంఘం తరపున తెలియజేస్తున్నాము.

# జోగిపేట పట్టణంలో నూతనంగా ఏర్పడిన ఎస్ వి మార్ట్ ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణారెడ్డి

**- ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు)**

ప్రజాదివాస్

ఆందోల్ నియోజకవర్గం అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో యూనియన్ బ్యాంక్ ఎదురుగా కోట నరేష్ గారు నూతనంగా ఏర్పాటు చేసిన యస్ వి మార్ట్ ను గౌరవ



మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణ రెడ్డి గారు రిబ్బన్ కట్ చేసి మార్ట్ ను ప్రారంభం చేయడం జరిగింది వారితో పాటుగా వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు )గారు మాజీ కౌన్సిలర్ న్యాయవాది అల్లే శ్రీకాంత్ గారు కోట సాయిబాబా గారు గజవాడ రాజేశ్వర్ గారు, బీపేట సంపత్ కుమార్ గారు, పోల రఘునాథ్ గారు, కోవూరి విజయ్ కుమార్ గారు, పురం రఘు గారు, గంగోత్రి శ్రీనివాస్ గారు, గాజుల పవన్ కుమార్ గారు, గొర్లకాడి కుమార్ గారు ఇంకా ఇతర పెద్దలు కుటుంబ సభ్యులు పుర ప్రముఖులు పాల్గొన్నారు

# విద్యార్థుల భద్రతపై రవాణా శాఖ ప్రత్యేక తనిఖీలు

ప్రజాదివాస్

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆటో రిక్షాలు, మినీ క్యాబ్‌లు, ఇతర వాహనాల్లో ప్రయాణించే విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా రవాణా అధికారి సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు కామారెడ్డి ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేయడంతో పాటు డ్రైవర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.తనిఖీల సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న పలు ఆటోలు, ఇతర వాహనాలను అధికారులు గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై సహాయక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రఫీ, ఉదయ్ చట్టపరమైన చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారులు మాట్లాడుతూ విద్యార్థుల భద్రత ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యత అని




పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపే సమయంలో వారు సురక్షితమైన, నిబంధనలకు అనుగుణమైన వాహనాల్లోనే ప్రయాణిస్తున్నారో లేదో తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. వాహనదారులు పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోకుండా, రహదారి భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని హెచ్చరించారు. విద్యార్థుల భద్రతకు ఎలాంటి విఘాతం కలగకుండా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. పాఠశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, వాహనదారులు రవాణా శాఖకు సహకరించి విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి తోడ్పడాలని వారు విజ్ఞప్తి చేశారు.

# దుబ్బాక నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

- శ్రావణ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు..
- ఉపవాస దీక్షలు ఆచరించిన భక్తులు



ప్రజాదివాస్

శ్రావణ శనివారం సందర్భంగా ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామ శివారులోని నల్లగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. అటవీ ప్రాంతంలో కొలువుదీరిన స్వామివారిని దర్శించుకునేందుకు దుబ్బాకతో పాటు సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే భక్తులు ఆలయం వద్ద బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రావణమాసం సందర్భంగా పలువురు భక్తులు ఉపవాస దీక్షలు ఆచరించి.. స్వామివారికి ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. నల్లగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సుమారు 400 ఏళ్ల చరిత్ర ఉందని తెలిపారు. శ్రావణమాసంలో జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారని చెప్పారు. శ్రావణ శనివారం కావడంతో ఆలయ పరిసరాలు భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

# కొత్తగూడెం రాజకీయంలో ఆసక్తికర పరిణామం: కీలక నాయకుల కీలక భేటీ



ప్రజాదివాస్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో నేడు రాజకీయంగా ప్రాధాన్యత కలిగిన భేటీ జరిగింది. రాష్ట్ర మైనార్టీ నాయకులు, డాక్టరేట్ గ్రహీత నయీమ్ ఖురైషి క్యాంప్ కార్యాలయంలో ముఖ్య నాయకులు సమావేశమయ్యారు.?ఈ భేటీలో నయీమ్ ఖురేషితో పాటు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ , జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ ఖాన్ పాల్గొని ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

# ధర్పల్లి సర్కిల్ నుంచి సురేష్ బండారి ఘన విజయం



ప్రజాదివాస్

జిల్లా పోలీసు అధికారుల సంఘం ఎన్నికల్లో ధర్పల్లి సర్కిల్ నుంచి హెడ్ కానిస్టేబుల్ సురేష్ బండారి అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. ప్రస్తుతం సిరికొండ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన.. సంఘం ఎన్నికల్లో విజయాన్ని నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ బండారి మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి విజయం అందించిన పోలీసు సిబ్బందికి, సహకరించిన ప్రతి ఒక్కరికీ, పోలీసు ఉన్నతాధికారులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సురేష్ బండారి పేర్కొన్నారు.

# హనుమకొండ కాంగ్రెస్ కార్యాలయంలో ఎస్ఐఆర్ ఫేజ్-2 పై శిక్షణ శిబిరం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

ప్రజాదివాస్

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వరంగల్ వెస్ట్ నియోజకవర్గ 2వ విడత శిక్షణ శిబిరం.. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ వెస్ట్ నియోజకవర్గ ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ ఫేజ్-2) పై శిక్షణ శిబిర కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మరియు గోదా దేవి ఆధ్వర్యంలో ఈ శిక్షణ ప్రక్రియ విజయవంతంగా జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, టీపీసీసీ పార్లమెంట్ కోఆర్డినేటర్ నజీర్ హాజరయ్యారు. కార్యక్రమంలో టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, భట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసే దిశగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ఒత్తిడి తెచ్చే జేబు సంస్థలుగా మార్చుకుందని ఆరోపించారు. ఈడీ నిర్వహించిన దాడుల్లో 90 శాతానికి పైగా ప్రతిపక్ష పార్టీల నేతలపైనే జరిగాయని పేర్కొన్నారు. ప్రతి పౌరుడి ఓటు హక్కును రక్షించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బీఎల్‌ఏలు గత రెండున్నర నెలలుగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేస్తున్నారని తెలిపారు. బీఎల్‌ఏల లిస్ట్ లను సమర్పిస్తే ఎన్నికల సంఘం నమోదు చూపించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు నమోదును తప్పనిసరిగా పరిశీలించుకుని, అవసరమైతే సవరణలు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వరంగల్ వెస్ట్ లో సుమారు 20



శాతం ఓట్లు తొలగించబడగా, ఇతర ఓట్లకు నోటీసులు జారీ చేయడం ఆందోళనకర పరిణామమని పేర్కొన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 18 ఏళ్ల యువతకు ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేశారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు పునాది అని, ప్రతి ఓటు విలువైనదని అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని సమావేశంలో నాయకులు అభిప్రాయపడ్డారు.

# పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది

- అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందిస్తాం
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

ప్రజాదివాస్

గత 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు అందక అర్హులైన ఎందరో పేదలు ఇబ్బందులు పడ్డారు శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం యందు పరకాల టౌన్, పరకాల, నడికుడా, ఆత్మకూర్, దామెర మండలాల పరిధిలోని పేద కుటుంబాల లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని



అన్నారు. పరకాల నియోజకవర్గంలో ఓటరు మహాశయుల వల్ల ఇంత మంచి అవకాశంలో పాల్గొనే అవకాశం దక్కిందని. తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత ప్రజలకే అని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం దాదాపు 88,384 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి నెల 1832.06 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. నూతన రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారా 18,365 మంది చేరారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత చేరువ చేసేందుకు ప్రజా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందిస్తాం అని, గత 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు అందక అర్హులైన ఎందరో పేదలు ఇబ్బందులు పడ్డారని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు కేవలం రేషన్ సరుకులు పొందేందుకు మాత్రమే కాకుండా, అర్హతను బట్టి వివిధ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు పొందేందుకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు

# నిజామాబాద్, కామారెడ్డి రెవెన్యూ, గృహ నిర్మాణంపై మంత్రి సమీక్ష..

ప్రజాదివాస్

నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాలకు




సంబంధించిన రెవెన్యూ అంశాలు, గృహ నిర్మాణ కార్యక్రమాల ప్రగతిపై మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులు సమావేశంలో పాల్గొని ఆయా శాఖల పరిధిలో కొనసాగుతున్న కార్యక్రమాల పురోగతి, పెండింగ్ అంశాలు, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను మంత్రికి వివరించారు. ముఖ్యంగా గృహ నిర్మాణ కార్యక్రమాల పురోగతి, లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, లక్ష్యాల సాధన తదితర అంశాలపై సమీక్షించారు. అలాగే రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ సమస్యలు, సర్వే, రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై అధికారుల పనితీరును సమీక్షించి, ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్, స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ సంస్థ ఎం.డీ. గౌతమ్, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు భవేష్ మిశ్రా, ఆశిష్ సాంగ్వాన్‌తో పాటు ఆయా శాఖలకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పాముకాటు గురై వ్యక్తి మృతి...

ప్రజాదివాస్

మృతుడి వివరాలు: పండు చిన రాముడు, వా/శీ. చెల్లయ్య, 36సం ‘, కోయ, వ్యవసాయం, ర్ /శీ. ఖమ్మంపాడు గ్రామం, అశ్వరావుపేట మండలం... నిన్న రాత్రి 10:30 గంటల సమయం లో మృతుడు తన యొక్క వరి వరి పొలానికి నీళ్లు పెడుతుండగా పాము కాటుకు గురైనాడు. అతనితో అతనితోపాటు నీళ్లు పెట్టడానికి వెళ్లిన పక్క



చేను రైతు లయిన మొడియం దుర్గారావు, గొంది సిరమయ్య లు అతని అరుపులు విని వెంటనే అతన్ని పెద్ద వాగు ప్రాజెక్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకి తరలించగా వారు మెరుగైన వైద్యం నిమిత్తము అశ్వరావుపేట హాస్పిటల్ కు వెళ్ళమని సూచించగా, మృతుని కుటుంబ సభ్యులు మండలం మద్దిగట్ల గ్రామంలో నాటు వైద్యం చేపించి ఇంటికి తీసుకెళ్లినారు. ఆ తర్వాత మృతుడి ఆరోగ్యం విషమించేసరికి, మరల వైద్యం నిమిత్తం అశ్వరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరిశీలించి అతడిని మెరుగైన వైద్యం కోసం మంచి హాస్పిటల్కి తీసుకెళ్ళమని చెప్పగా మృతుని తరలిస్తుండగా మార్గమధ్యంలో సత్తుపల్లి ఏరియా హాస్పిటల్ లో చేర్పించినారు. అప్పటికి డాక్టర్లు పరిశీలించి మధ్యాహ్నం రెండు గంటల పది నిమిషాల సమయంలో మరణించినాడని నిర్ధారించినారు. మృతునికి భార్య, ఇద్దరు అమ్మాయిల సంతానం కలరు. మృతుని అన్న పండు. నాగేశ్వరరావు ఫిర్యాదు పై ఎస్సై టి యయాతి రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినారు.

# వి బి జి రామ్ జి రద్దు చేయాలి




ప్రజాదివాన్

సంక్షేమ పథకాలు అమలు చేయాలి పెనుబల్లి ఆగస్టు 22 2026 తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కమిటీ సమావేశం చలమల సూర్యనారాయణ భవన్ పెనుబల్లిలో గాయం తిరుపతి రావు అధ్యక్షతన శనివారం జరిగింది ఈ సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన12 సంవత్సరాలలో వ్యవసాయ కార్మికులకు గాని పేదలకు గాని చేసిందేమీ లేదని ఆయన అన్నారు ప్రజల నడ్డి విరిసి వసూలు చేస్తున్న జీఎస్టీ పనులను కూడా కార్పొరేట్ వాళ్లకు రాయితీలు ఇస్తున్నారు వ్యవసాయ కార్మికుల మీద భారాలు వేస్తున్నారని ఆయన అన్నారు వామ పక్షాలు వ్యవసాయ కార్మిక సంఘాలు పోరాడి సాధించిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి విబిజీ రాంజీ బిల్లు తెచ్చి కేంద్రం 60 శాతం భరిస్తుంది రాష్ట్రాలు 40% భరించాలని షరతు పెట్టి అమలుకు పూనుకోవడం అంటే ఉపాధి హామీ చట్టాన్ని పేదలకు లేకుండా చేయడమేనని ఆయన అన్నారు రాష్ట్రాలు తమ అవసరాలకు బడ్జెట్ లేక ఇబ్బందులు పడుతుంటే కేంద్ర ప్రభుత్వం ప్రతినెల 2 లక్షల కోట్లు జీఎస్టీ పన్నులు వసూలు చేస్తూ సంపన్నులకు కార్పొరేట్లకు రాయితీలుస్తూ వ్యవసాయ కార్మికులకు పేదలకు ఉపాధి పని లేకుండా చేస్తుందని ఆయన అన్నారు పాత పద్ధతిలోనే మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని వి బి జి రాంజీ బిల్లు రద్దు చేయాలని 125 రోజులకు పని దినాలు పెంచమని చెప్తున్నా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో 86 వేల కోట్లు కేటాయించి ఉపాధి కూలీలకు అన్యాయం చేస్తున్నారని న్యాయం జరగాలంటే మూడు లక్షల కోట్లు కేంద్ర బడ్జెట్లో కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వమే రేషన్ షాపుల ద్వారా ప్రతి కుటుంబానికి 30 కేజీల బియ్యం 14 రకాల నిత్యవసర వస్తువులు అందివ్వాలని ఆయన డిమాండ్ చేశారు విద్య వైద్యం కోసం ప్రతి కుటుంబానికి పదివేల రూపాయలు ప్రతినెలా10 వేలరూపాయలు ఇవ్వాలని ఆయన అన్నారు పేదలకు ప్రతినెల సంక్షేమం కోసం ఇచ్చే పదివేల రూపాయలు భారతదేశం లోనే పారిశ్రామిక రంగం సేవారంగం ఉత్పత్తి రంగం అభివృద్ధి కావడానికి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు కార్పొరేట్లకు రాయితీలు ఇవ్వడం వల్ల భారత దేశంలోని సాధారణ ప్రజలకి ఏ మేలు జరగదని పేదలకి సంక్షేమ పథకాలను వర్తింపజేయడం వల్ల భారతదేశ జిడిపి పెరుగుతుందని ఆయన అన్నారు రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలి మున్సిపాలిటీలలో కూడా ఉపాధి హామీ పనిని వంద రోజులు నుంచి 150 రోజులకు పెంచి 400 రూపాయలు రోజుకూలి ఇస్తానన్న మాటను నిలబెట్టుకోవాలి ప్రతి మహిళకు ప్రతినెలా 2500 రూపాయలు ఇస్తానన్న హామీని అమలు చేయాలి సామాజిక పెన్షన్లన్నీ4000 కి పెంచాలి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఇస్తానన్న 12 వేల రూపాయలను వ్యవసాయ కార్మికులందరికీ ఇవ్వాలి ఇందిరమ్మ ఇల్లు అరులైన పేదలందరికీ స్థలాలు ఇచ్చి ఇండ్లు కట్టివ్వాలని ఆయన డిమాండ్ చేశారు ఖమ్మం జిల్లాలో అభివృద్ధి కోసం గోదావరి మీద ఆనకట్ట కట్టి ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ సమావేశంలో గత కార్యక్రమాలు భవిష్యత్ కర్తవ్యాలు ఎజెండాను డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాసరావు ప్రవేశపెట్టగా చర్చించి సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 31 వ తారీకు ఖమ్మం కలెక్టరేట్ ముందు జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జాజిరి శ్రీను గారు కోరారు గిరిజన గిరిజనేతర పేదలకు పోడు పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్ నాయకులు పులి కృష్ణయ్య చల్లా నాగేశ్వరరావు కువ్వారపు లక్ష్మణరావు బండి వేలాద్రి దాట్ల రాంబాబు వడ్డెగ బజారు అనుమోలు కృష్ణయ్య సిఐటియు జిల్లా కోశాధికారి చలమాల విఠల్ పాల్గొన్నారు

# పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ అడ్డా

- పరకాల నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షులు ఏరుకొండ రవీందర్ గౌడ్
- అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందిస్తాం....
- గత 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు అందక అర్హులైన ఎందరో పేదలు ఇబ్బందులు పడ్డారు.



ప్రజాదివాన్

శనివారం గాంధీభవన్ నుంచి పిఎసిఎస్ ఛైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత ప్రజలకే అని అన్నారు.నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం దాదాపు 88,384 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు.ప్రతి నెల 1832.06 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. నూతన రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారా 18,365 మంది చేరారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత చేరువ చేసేందుకు ప్రజా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందిస్తాం అని,గత 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు అందక అర్హులైన ఎందరో పేదలు ఇబ్బందులు పడ్డారని అన్నారు.స్మార్ట్ రేషన్ కార్డు కేవలం రేషన్ సరుకులు పొందేందుకు మాత్రమే కాకుండా, అర్హతను బట్టి వివిధ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు పొందేందుకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల గృహ జ్యోతి కింద పంపిణీ చేస్తున్నాము.500 గ్యాస్ పంపిణీ చేస్తున్నాం. మహిళలకు ఉచిత ప్రయాణం త్వరలో కుట్టుమిషన్ల పంపిణీ బి ఆర్ఎస్ నాయకులు ఎన్ని ఊసరవెల్లి రాజకీయం చేసిన ఎగిరేది పరకాల గడ్డమీద రేవూరి జెండా 10 సంవత్సరాల ప్రభుత్వంలో ఒక రేషన్ కార్డు ఇయ్యకుండా ఏ మొఖం పెట్టుకొని ఓటర్ల దగ్గరికి పోయి ఓట్ల అడుగుతారు నేను ప్రశ్నిస్తున్న? ఇప్పటికైనా కాంగ్రెస్ చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆలోచించి విమర్శల మానుకొని ప్రజల గురించి ఆలోచించాలని పత్రికాముఖంగా నేను తెలియజేస్తున్నా.

# వరంగల్ జిల్లాలో ప్రజావాణి దరఖాస్తులకు విముక్తి ఎప్పుడు?

- రైతు రోదన పెండింగ్ ఫైల్ గుట్టపై కలెక్టర్ తక్షణ జోక్యం భూభాధిత రైతుగా ఉగ్ర స్వరం
- జిల్లాలో ఏళ్ల తరబడి న్యాయం కోసం ఎదురుచూసిన, మళ్లీ నియోజకవర్గాల్లో, మండలాల్లో ప్రజావాణి దరఖాస్తు చేస్తే న్యాయం జరుగుతుందా?...
- రైతు:, కూస సుదర్శన్...



ప్రజాదివాన్

వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఖాదర్పేట గ్రామానికి చెందిన, రైతు ఆవేదన మళ్లీ మళ్లీ ప్రజావాణి గడపకు తట్టవలసి వస్తుంది. కానీ నా భూ సమస్య పరిష్కారం మాత్రం కనిపించడం లేదు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి రైతులకు చివరి ఆశగా మారింది. అయితే ఆ ఆశ కూడా ఇప్పుడు నిరాశగా మారుతుందని, బాధిత రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట నియోజక వర్గం చెన్నారావుపేట మండల పరిధి కాదర్ పేట గ్రామం నుండి పొద్దున్నే లేచి ఉదయం ఏడు గంటలకే జిల్లా కేంద్రానికి చేరుకొని తన గోడును వినిపిస్తున్నారు.ఒక పేద డిస్లేబ్డ్ రైతుగా కూలీ పనులు మానుకొని అప్పులు చేసి ప్రయాణ ఖర్చులు భరిస్తూ ప్రజావాణిలో ఎన్నో దరఖాస్తులు సమర్పిస్తున్నామని ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. కానీ వెంటనే నా ఫైల్ పురోగతిపై దరఖాస్తు ఫిర్యాదికి సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. అయితే వాస్తవంగా ఆచరణలో ఇది కనిపించడం లేదని రైతు కన్నీటి పర్యంతమయ్యారు."నా దరఖాస్తు ఏ అధికారి వద్ద ఉంది? మీరు ఏం చర్యలు తీసుకున్నారు? తదుపరి దశ ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం లేక రైతుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. వారంలో పరిష్కరించాల్సిన సమస్య ఒక నెల లేదా సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉండటం పరిపాలన నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన వాపోయారు.గత అనుభవాలే పునరావృతమవుతున్నాయా ఇది కొత్త సమస్య కాదు. గతంలో కూడా ఎన్నో దరఖాస్తులు సమర్పించినప్పటికీ న్యాయం చేయలేదని ఆయన గుర్తు చేశారు. భూమి రికార్డుల లోపాలు పట్టాదారు పాస్ బుక్స్ జారీ ఆలస్యం సరిహద్దు వివాదాలు పోరపాట్ల సవరణల వంటి అంశాలు సంవత్సరాల తరబడి జాప్యం చేయడం వల్ల తీవ్ర కష్ట నష్టాలని ఎదుర్కొనవలసి వస్తుంది. ప్రభుత్వ పథకాల లబ్ది దూరం అవుతోంది. ఒక చిన్న నిర్లక్ష్యం నా యొక్క రైతు కుటుంబాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తుంది. ప్రజావాణి అనే ఆశా కిరణం కూడా వెలిసిపోతే రైతు ఎవరిని ఆశ్రయించాలి? అనే ప్రశ్నలు వినిపించవలసి వస్తుంది.తప్పుడు నివేదికలు నిజాలు దాచి పెడుతున్నారా? జిల్లా కలెక్టర్ కు తప్పుడు నివేదికలు పంపుతున్న రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఆలస్యం కారణంగానే సమస్యలు పరిష్కారం కాకుండా వాయిదాలు పెడుతున్నారని ఆయన ప్రశ్నించారు. "నిజ స్థితిని దాచిపెట్టి" పై అధికారులకు తప్పు సమాచారం అందిస్తున్న అధికారులపై సస్పెన్షన్ వంటి కఠిన చర్యలు తీసుకుంటేనే వ్యవస్థ సరిదిద్దబడుతుంది. న్యాయాన్ని కాపాడవలసిందిగా ఆయన కోరారు. న్యాయాన్ని జాప్యం చేస్తే మా జీవనాధారాన్ని దెబ్బతీయడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

కలెక్టర్ ప్రత్యక్ష సమీక్ష అవసరం ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రజావాణి దరఖాస్తులపై సమగ్ర సమీక్ష నిర్వహించి మొత్తం ఎన్ని దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ పెరుగుతోంది. ప్రతి దరఖాస్తుకు ఖచ్చితమైన సమయ పరిమితి నిర్ణయించి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని రైతులు కోరుతున్నారు. ఫైల్ పురోగతిపై ప్రతి దరఖాస్తుదారునికి సంక్షిప్త సందేశం లేదా నిఖిత పూర్వక సమాచారం అందించే విధానాన్ని వెంటనే అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. పారదర్శకత లేకుండా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. న్యాయం చేయకపోతే ప్రజావాణి దరఖాస్తులను పారేయండి అని రైతుల ఉగ్రరూపం రైతుల ఆవేదన మా దరఖాస్తులకు విలువ లేకపోతే ప్రజావాణి పేరే ఎందుకు? న్యాయం చేయలేక పోతే ఆ దరఖాస్తులను ప్రాజెక్టు కాలువల్లో పారేయండి అంటూ వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన పరిపాలన వ్యవస్థే నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటాయని వారు అన్నారు.

స్పందన కోసం ఆసక్తిగా ఎదురుచూపులు

జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం వినిపించే ఈ వేదనకు ఎప్పుడు పరిష్కారం లభిస్తుందో ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. రైతు కన్నీటి విలువ తెలిసిన పరిపాలన తక్షణమే స్పందించి భూ బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజల ఆశల వేదికగా నిలవాలంటే, "మూడు అంశాలు తప్పనిసరి "ఫైళ్లకు వేగం, అధికారులకు బాధ్యత, బాధితులకు తక్షణ న్యాయం", ఇవి అమలు కానిపక్షంలో రైతుల ఆవేదన మరింత తీవ్రమై ఆందోళనల దిశగా వెళ్లే అవకాశం ఉందని గ్రామాల్లో చర్చలు సాగుతున్నాయి. రైతు బతుకుతేనే గ్రామం బతుకుతుంది.గ్రామం బతుకుతేనే జిల్లా అభివృద్ధి చెందుతుంది. ఇప్పుడు జిల్లా పరిపాలన చేతుల్లోనే ఉందని కలెక్టర్ జోక్యం చేసుకొని విచారణ జరిపించి త్వరగా పరిష్కరించాలని రైతు కూస సుదర్శన్ కోరారు.

# పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు.....

- కుషాయిగూడ డిపో మేనేజర్ వేణుగోపాల్



ప్రజాదివాన్

శ్రావణమాసం పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కుషాయిగూడ డిపో నుండి వివాహాది శుభకార్యములకు విహార యాత్రలకు అద్దె ప్రాతిపదికన తక్కువ ధరలలో బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అలాగే రాష్ట్రంలోని మరియు ఇతర రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, గోవా, మధ్యప్రదేశ్,మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రాలకు, విహారయాత్రలకు కూడా ప్రత్యేక బస్సులు నడపబడుతున్నవని తెలియజేశారు.కనీసం 30 మంది ప్రయాణికులు ఉన్నట్లయితే వారు కోరుకున్న చోటకి బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. అంతేకాకుండా కుషాయిగూడ డిపో నుండి అంతర్రాష్ట్ర సర్వీసులకు రిటర్న్ జర్నీ టికెట్ బుక్ చేసుకుంటే వారికి టికెట్ చార్జీలో10% రాయితీ ఇస్తున్నట్లు తెలియజేశారు తిరుపతి, గుంటూరు, అమలాపురం, కందుకూరు,విజయవాడ లకు ఈ బస్సులు నడుపుతున్నామన్నారు. బస్సుల బుకింగ్ కై 9959226145,9493210071 సంప్రదించవచ్చున్నారు